

# ఫారిన్ వెళ్ళాల(న)ండీ

## - వసుంధర



***మనం ఎంత ఆధునికమైనా, చరిత్రకున్న విలువ మరువలేనిది. అలానే ఈ రోజుల్లో ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎక్కడికైనా వెళ్ళగలిగే సౌకర్యాలు (డబ్బులుంటే చాలు) ఉన్నాయి కానీ కొన్ని దశాబ్దాల క్రిందట (1970 దశకం ప్రారంభంలో) ఇలాంటి ప్రయాణాల వెనుకనున్న సాధకబాధకాలు తెలుసుకోవడం ఇప్పటికీ ఆసక్తికరంగా ఉంటుంది. -సం.***

*(గత సంచిక తరువాయి)*

1974-75 వాతావరణంలో అప్పటి పశ్చిమజర్మనీ దేశం ఈ రచనలోని సన్నివేశాలకు వేదిక. ఆ సన్నివేశాలను వివరించినది – అప్పటి వాతావరణంలో సంప్రదాయబద్ధంగా పెరిగి, ఆధునికతని అవగాహన చేసుకుంటున్న ఓ మధ్యతరగతి భారతీయుడు. వృత్తిరీత్యా సైంటిస్టు.

అప్పటికి ఇండియాలో టివిలు కొన్ని మహానగరాలకే పరిమితం. టెలిఫోన్లు వ్యాపారస్థులకీ, భాగ్యవంతులకీ, ఉన్నతోద్యోగులకే అందుబాటు. కంప్యూటర్లది పాశ్చాత్యదేశాల్లోనూ పెద్ద గదిని కేటాయించాల్సినంత పరిమాణం. మొబైల్సు, ఇంటర్నెట్ వగైరాలు వాడుకలోకొస్తాయన్న ఊహ కూడా లేదు.

ఇండియాలో ఇప్పుడు గ్రామాలకున్న సదుపాయాలు, అప్పుడు మహానగరాలకే లేవు. ఆ నేపథ్యాన్ని స్మరించి – రచయితతోపాటు పాఠకులూ 1974లో పయనించి – చదవడం మొదలెడితే – ఈ రచనలోని చాలా విశేషాలు మరింత రసానుభూతినిస్తాయి. ఐతే 2016-17లోనూ – 'మనం ఎక్కణ్ణించి ఎక్కడికొచ్చాం? ఎక్కడికి పోతున్నాం?' అనే భావనను కలిగించి ఆలోచింపజెయ్యగలిగితే, ఈ రచన సార్థకమౌతుంది.

అంశాల పరంగా ఇది రెండు భాగాల రచన. మొదటిది ల్యానబర్గులో 'పీజీ టు కేజీ' గత మాసంలో ముగిసింది. ఇప్పుడు రెండవది 'బెర్లిన్ ద్వీపే డాయిచ్ ఖండే'లో తొలివిడతగా 'ఫన్ నేనొక్కడినే'. ఇందులో అంశాల్ని జరిగిన వరుస క్రమంలో కాక – పాఠకులకు అనువుగా ఉండేందుకు ఉపశీర్షికల్లో వివరించడం జరిగింది.

రసానుభూతితోపాటు, ప్రయోజనాత్మకమూ కావాలన్న మా తపన అక్షరరూపం దాల్చడానికి స్ఫూర్తినిచ్చిన కౌముదికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుకుంటూ, రచనలోకి అడుగెడుతున్నాం.

# రెండవ భాగం: బెర్లిన్ డ్వీపే డొయిచ్ ఖండే

## *చివరి విడత: మలి సందడి (42)*

### బెర్లిన్లో సంగీతవిభావరులూ, సంధ్యలూ

సత్యవతిగారు గొంతు సవరించుకుని, "ఇది దేవులపల్లి కృష్ణశాస్త్రి రచన. తనకు గొంతు పోయి మూగతనం వచ్చినప్పుడు ఆయన కృష్ణరజని పేరిట కొన్ని గేయాలు వ్రాశారు. కృష్ణరజని అంటే చీకటి రాత్రి అనే కాదు, కృష్ణశాస్త్రి రచనకు రజనీకాంతరావు సంగీతం సమకూర్చారన్న సూచన కూడా ఉంది" అని మరోసారి గొంతు సవరించుకుంది.

"మొదట గొంతు సవరించుకున్నది మాటలకి. ఇప్పటి సవరణ పాటకి. శ్రోతలు గమనించాలి" అన్నాడు రావుగారు వెంటనే.

"సవరించుకోవడం సవరించుకోవడమే. ఇన్ని రకాలుండవు" అంది సత్యవతి.

"ఏమో, ఆడవాళ్లు ఇంట్లో మసిలేటప్పుడు ఒకలాగా, బయటికెళ్లేటప్పుడు మరొకలాగా చీర సవరించుకుంటారనేది మా అమ్మ" అన్నాడు రావుగారు. నేటి పరిభాషలో పంచ్ అనిపించుకునే సరుకు చాలా ఉంది రావుగారి దగ్గర.

"నా నోరు కట్టెయ్యడానికి అత్తయ్య పేరు చెప్పడమెందుకూ...." అని సత్యవతిగారు మరోసారి గొంతు సవరించి, భర్త మళ్లీ ఏదో అనేలోగానే ఆలాపన మొదలెట్టింది.

అంతే– అక్కడ నిశ్శబ్దం ఆవరించుకుంది.

దేవులపల్లి కృష్ణశాస్త్రి తెలుగునాట అత్యుత్తమ భావకవుల్లో ఒకరని సాహిత్యంతో పరిచయం లేనివారికి కూడా తెలుసు. ఆయన ప్రసక్తి రాగానే 'ఊర్వశి', 'కృష్ణపక్షము' పేర్లను ప్రస్తావించడం– 'నవ్విపోదురు కాక నాకేటి సిగ్గు' అన్నది కొటేషనుగా చెప్పడం– సాహితీపరులు అనిపించుకునేందుకు సరిపోతుందని– కాలేజి రోజుల్లో డిబేట్ పోటీల్లో కొందరు మిడిమిడి జ్ఞానపువారి ప్రసంగాలు విని తెలుసుకున్నాను. సాహితీపరుడు అనిపించుకోవాలనే తాపత్రయం లేకపోవడంవల్లనూ– కథలపై ఉన్న మోజు కవిత్వంపై, ముఖ్యంగా భావకవిత్వంపై లేకపోవడం వల్ల– నాకు ఆయన సినీకవిగానే ఎక్కువ పరిచయం. ఆయన సినీగీతాలు నాకు చెప్పలేనంత ఇష్టం కూడా. ఒక దశలో ఆయనకి గొంతు పోయిందని విన్నాను కానీ, నాకీ 'కృష్ణరజని' గురించి తెలియదు.

పాట మొదలైంది.

నీ ఆనయైన స్వామీ

నా ఔదల నిడికోనా– నీ ఆనయైన స్వామీ....

పోనీలే! నీ దయ ఇంతేనని అన్నానా– నీ ఆనయైన స్వామీ....

మాట తీసుకొని నాకు

మౌన మొసగినావు!

మౌన మందికొని నీకు

గాన మియ్య మంటావు– నీ ఆనయైన స్వామీ....

నా కంఠము చీకటైన

ఈ కృష్ణ రజని తుదిని

నా కయి నీ చెయి చాచిన

నా కానుక ఇంతే గద, ఈ కొంచెపు పాటే గద– నీ ఆనయైన స్వామీ.....

గుండెల్ని పిండేసే భావం. ఆ భావానికి తగ్గ స్వరకల్పన.

పాటలోని భావమంతా వరసలో నిండిపోతే, దాన్నామె గొంతు ఒడిసి పట్టుకుని వినిపించినట్లుంది.

'పోనీలే నీ దయ ఇంతేనని అనుకున్నా' అనడంలో అసహాయతో కూడిన వేదన, 'నా కంఠము చీకటైన....' అన్నప్పటి బాధ–

వాటిని పలికిన అపురూప స్వరం. ఆ స్వరానికి తోడైన సాధన.

మనది కాని ఓ గంధర్వలోకానికి వెళ్లిపోయాను.

పాటలో అనుభూతులన్నీ మనసుకి పట్టేశాయేమో– పాట ఐపోయేసరికి కళ్లు తుడుచుకోక తప్పలేదు.

ఆరోజు ఆమె నోట వినడమే! ఆ తర్వాత ఆ పాటని మరొకరు పాడగా వినలేదు. అందుకేనేమో– ఆ పాట గుర్తొస్తే చాలు– ఇప్పటికీ ఆమె గొంతే నా చెవుల్లో ప్రతిధ్వనిస్తుంది.

అప్రయత్నంగా అంతా చప్పట్లు కొడితే, నిద్రపోతున్నాడనుకున్న మా బాబు కూడా ఓసారి లేచి కూర్చుని తనూ చప్పట్లు కొట్టి మళ్లీ తల్లి ఒడిలో పడుకున్నాడు.

"ఈ పాట గురించి ఇంతవరకూ తెలియదు. ఇలా నాకు తెలియని గొప్ప పాటలు ఇంకా ఎన్నున్నాయో! సంగీత సాహిత్యాల్లో సినీగీతాలకు పరిమితమైన మా అభిరుచికి కొత్త కోణాన్నిచ్చారు. చాలా చాలా థాంక్సు" అన్నాను నేను నాతో శ్రీమతినీ కలుపుకుని.

రావుగారి మొహంలో వెలుగు. "మా అవిడని చెప్పుకోవడం కాదు కానీ, షి ఈజ్ ఆసమ్. ఇదే కాదు– ఇంకా ఎక్కడా కనీ వినీ ఎరుగని పాటలు చాలా తెలుసుకున్నాను తననుంచి" అన్నాడు గర్వంగా.

సత్యవతికి మొహమాటం వేసినట్లుంది. మాట తప్పించడానికన్నట్లు, "పాటల్నెవరూ కనరు. వింటారు" అంది తెనాలి రామకృష్ణుడి 'రాజ కంఠీరవా' లెవెల్లో,

అల్లసాని పెద్దన అంతటివాడే ఆ దెబ్బకి. "మంచి పట్టే పట్టావు మనవడా!" అని మెచ్చుకుని దాటేశాడు. కానీ రావుగారు అలా వదిలేసే రకంకాదు, "కనకుండానే పుడతాయా పాటలు?" అన్నాడు చటుక్కున.

ఈ రిటార్టు నేనూహించనిది. థ్రిల్లైపోయాను.

సత్యవతి కూడా థ్రిల్లయినట్లుంది. భర్త సమయస్ఫూర్తికి ముచ్చటగా నవ్వేసి ఊరుకుంది తప్ప మరి బదులివ్వలేదు.

ఇలాంటి భువనవిజయాలెన్నో వారింట్లో!

ఆ తర్వాత ఒకసారి అనుకోకుండా మరీ రావుగారింట్లో అంతలా కాకపోయినా మా ఇంట్లోనూ ఓ సంగీత సంధ్య (విభావరి అంటే రాత్రి కదా, మేం కలుసుకున్నది ఓ సాయంకాలం కాబట్టి సంధ్య అన్నాను) జరిగింది.

రావు దంపతుల గురించి మేం చెప్పింది విని ప్రసాద్ దంపతులు– వాళ్ల పరిచయానికి కుతూహలపడితే– మేమో సాయంత్రం వారినీ వీరినీ కూడా టిఫినుకి పిలిచాం.

అప్పుడు రావు దంపతులిద్దరూ గొంతు కలిపి, 'బ్రహ్మ కడిగిన పాదము' అన్న పాట పాడారు.

"బెర్లిన్లో మీవంటివారి నోట అన్నమయ్య కీర్తన వినే అదృష్టం కలుగుతుందని ఊహించలేదు. ముందుగా మిమ్మల్ని పరిచయం చేసిన ఈ రావు దంపతులకి, ఆ తర్వాత మీ దంపతులకి మా ధన్యవాదాలు" అంది శ్రీమతి ప్రసాద్.

ఆమెకు ఇంత సంగీతపరిజ్ఞానముందని తెలిసి ఆశ్చర్యపడ్డాను.

అన్నమయ్య కీర్తనగా నాకు తెలిసింది– అనురాగం సినిమాలో భానుమతి పాడిన 'విన్నపాలు వినవలె' ఒక్కటే. 'బ్రహ్మ కడిగిన పాదము' అన్న పాట అన్నమయ్య కీర్తన అని తెలియదు. వినడమూ అదే మొదటిసారి. వారి దాంపత్యసామరస్యం గొంతులో సమన్వయమై ఆ పాటలో ప్రతిఫలించినప్పుడా అనుభూతి అనుభవైకవేద్యం.

శ్రీమతి ప్రసాద్ సత్యవతిని సోలోగా ఓ పాట పాడమని బలవంతపెట్టింది.

శ్రోతలకు తన గానప్రతిభపై ఆరాధనాభావమున్నదని తెలిసి కూడా– పాడమని అడిగినప్పుడు, పాడక తప్పదని తెలిసి కూడా, వెంటనే పాడడానికి సత్యవతి మొహమాట పడేది. అది కప్పిపుచ్చుకునేందుకు– పాడడానికి వేరే ఏదో కారణాన్ని వెదికి పట్టుకునేది.

ఆ కారణాలు ఆమె మొహమాటాన్ని గ్రహించడానికి మాత్రమే పనికొచ్చేవి.

శ్రీమతి ప్రసాద్ అంతలా పట్టుబడుతుంటే ఆమె శ్రీమతివైపు తిరిగి, "ఈమె మరీ పట్టుబడుతున్నారు. కర్ణుడి అస్త్రవిద్యలా సమయానికి నాకేం స్ఫురించడంలేదు. మీ బాబుని చూస్తుంటే, మా చుట్టాలబ్బాయి గుర్తుకొస్తున్నాడు. వాణ్ణి మేము ముద్దుగా నున్నూ అని పిలుస్తాం" అని మా బాబు బుగ్గలు పుణికి, "నున్నూ, ఈ పాట నీ కోసం" అని గొంతు సవరించుకుంది.

మా వాడికి అన్వయమయ్యే ఆ పాట ఏమిటోనని కుతూహలంగా– నేనూ, శ్రీమతీ చెవులు రిక్కించాం.

"స్వైరిణి అన్నారు నన్ను శ్యామసుందరా!" అని ఆరంభించిందామె.

నున్నూకి ఆ పాటతో ఏ బంధం, సంబంధం లేదు– పాటలో ఆ పదానికి దగ్గర్లో ఉన్న 'నన్ను' అనే పదం తప్ప!

మైమరచి విన్నామేమో– ఆ లాజిక్ అప్పుడు స్ఫురించలేదు.

ఇక శ్రీమతి ప్రసాద్ ఐతే, "బాలాంత్రపు రజనీకాంతరావు స్వయంగా రచించి స్వరపర్చిన ఈ పాట నాకెంతో ఇష్టం. నున్నూ కోసమని మీరు అన్నారు కానీ, ఇది నాకోసమే పాడారనిపించింది" అని ఆమెను మెచ్చుకుంటూనే మురిసిపోయింది.

నా ఆశ్చర్యానికి అవధులు లేవు. అంతవరకూ ఇండియాలోనే నా ఫ్రెండ్సు సర్కిల్లో ఇంతటి సంగీత పరిజ్ఞానమున్నవారు తటస్థపడలేదు. అందుకు కారణం అలాంటివారు లేక కాదు. లోపం నా అభిరుచిలో ఉందేమో!

ఎందుకంటే, ఇక్కడికొచ్చిన సుందరం తన భార్య పాడిన 'చలమేలరా సాకేత రామా' అన్న త్యాగరాజకీర్తన టేపులో వినిపించాడు. అలాగే పిళానీ సైంటిస్టు భార్య చిన్నప్పట్నించీ ఉత్తరాదిన పెరిగినా పాడ్డానికి, 'పిలచిన బిగువటరా' పాటని ఎన్నుకునేటంత అభిరుచితో ఉంది.

నావరకూ వస్తే...

చిన్నప్పుడు రేడియోలో వచ్చే లలిత సంగీత కార్యక్రమానికి ఆమడ దూరంలో ఉండేవాణ్ణి. పెద్దయినా రేడియో పెట్టుకునేది సినిమా పాటలకోసమే! సంగీత సరస్వతీ కటాక్ష లబ్ధులైన రావు దంపతుల సాహచర్యంతో– నా అభిరుచిని విస్తృతం చేసుకోవాల్సిన అవసరం ఉందనిపించింది. పాటలంటే సినిమా పాటలే కాదు– లలిత సంగీతం కూడా అంత జనాకర్షకంగానూ ఉంటుందని గ్రహించాను. అంతే కాదు– లలిత సంగీతంలో జనరంజనకంటే, ఉదాత్తతకు ప్రాధాన్యమని అర్థమైంది.

శ్రీమతి వెంటనే, "సంగీతానికి శుశ్రూష అంటారు. మరి సంగీత పరిజ్ఞానానికీ మీవంటివారి శుశ్రూష చెయ్యాలని నాకనిపిస్తోంది" అని శ్రీమతి ప్రసాద్‌ని మెచ్చుకుంది.

సత్యవతి వెంటనే, "అది ఉత్త పరిజ్ఞానం కాదు. జ్ఞానంతో వచ్చిన పరిజ్ఞానం" అని పాట పాడమని శ్రీమతి ప్రసాద్‌ని బలవంతపెట్టింది.

ఆమె కూడా సత్యవతిలాగే మొహమాటపడి, "మీ బాబు పేరు శ్రీరామకమల్ కదా! రాముడిమీద పాట పాడతాను" అని గొంతు సవరించుకుంది.

'రాముడుద్భవించినాడు రఘుకులమ్మున...' అని ఆమె ఎత్తుకునేదాకా ఆమె స్వరంలో అంత సంగీతముంటుందని నేనూహించలేదు. ఆతర్వాత సత్యవతి బలవంతపెట్టగా, 'శివుడు తాండవము చేసెనమ్మా, కైలాసగిరిలో శివుడు తాండవము చేసెనమ్మా' అని మరో పాట పాడింది.

తను పాడడమే కాదు, ఎదుటివారిలోని సంగీత ప్రతిభను గుర్తించే శక్తి సత్యవతికి ఉన్నట్లు అప్పుడే నేను గ్రహించాను.

రేడియోలో సినిమా పాతల శ్రోతగా పొందిన ఆనందం భౌతికం. జనరంజకమైన ఈ లలితగీతశ్రవణం ఇచ్చే అనుభూతి అలౌకికం.

సంగీతలోకం నుంచి, వాస్తవలోకంలోకి వస్తే- అక్కడ రావుగారితో ముచ్చట్లు లోకంపోకడపట్ల అవశ్యమైన అవగాహన కలిగించడానికి ఎంతో దోహదం చేశాయి.

*రావుగారి ముచ్చట్లు*

మొదటిసారి రావుగారింట్లో భోజనానికి వెళ్లినప్పుడు ముందోసారి ఇల్లంతా చూసొచ్చాం. \

ఇల్లు మరీ పెద్దది కాకపోయినా కుదుమట్టంగా ఉంది. అక్కడి నియమాల ప్రకారం పిల్లలిద్దరికీ కూడా వేర్వేరు బెడ్రూంలున్నాయి. కిచెనూ, డ్రాయింగురూమూ. డైనింగ్ హాల్ లేదు.

డ్రాయింగ్ రూంలో కలర్ టివి ఉంది. అప్పటికి ఇండియాలో నాలుగు మెట్రో నగరాల్లో తప్ప మరెక్కడా టివి సదుపాయం లేదు. ఆ ఉన్నది కూడా నలుపు-తెలుపు టివి. ఓ భారతీయుడు, అదీ ఓ తెలుగువాడు డ్రాయింగ్ రూంలో కూర్చుని కలర్లో టివి కార్యక్రమాలు చూడ్డం నాకు గొప్ప అదృష్టంగా అనిపించింది.

కబుర్లు చెప్పుకున్నా నా దృష్టి టివి మీదే ఉంది. అప్పుడు ఏదో కౌబాయ్ పిక్చర్ నడుస్తోంది. అలాంటి సినిమాలకి భాషాభేదం లేదు కదా! కాస్త ఆసక్తిగానే చూస్తున్నాను. దాంతో మిగతా ముగ్గురు పెద్దలూ కబుర్లలో పడితే, నేను సినిమానే చూస్తున్నాను. శ్రీమతికి సినిమాలంటే ఆసక్తి తక్కువ కనుక, తను కబుర్లలో బాగానే ఇన్వాల్వయింది.

ఉన్నట్లుండి, "మీవారు మనలో లేరు. కౌబాయ్ డ్రెస్సేసుకుంటే కానీ నావంక చూడరేమో!" అన్నాడు రావుగారు.

ఉలిక్కిపడ్డాను. ఆ వెంటనే మొహమాటంతో కూడిన సిగ్గు. సద్దుకుందుకు, "అంతెత్తు మనిషి మీరు. మీ పెర్సనాలిటీకి కౌబాయ్ డ్రెస్సూ, టోపీ చాలా బాగుంటాయ్. నిజంగానే చూడాలనుంది" అన్నాను.

"సరే- ఆ రెండూ సమకూర్చుకోవడం పెద్ద కష్టమేం కాదు. గుర్రమెక్కమంటేనే ఇబ్బంది" అని నవ్వేశాడు రావుగారు.

“అలాగంటారు కానీ, ఆయనకి గుర్రమెక్కడం మహా సరదా. ఇప్పటికీ రంగులరాట్నం ఎక్కితే గుర్రంమీదే కూర్చుంటారు. షాపుల బయట పిల్లలకోసం గుర్రం బొమ్మలుంటాయి కదా, వాటిమీద కూర్చోవాలని ఈయనకి మహా మనసు. ఎలాగో వారిస్తున్నాను. ఇక బాబు పుట్టినప్పట్నించీ– వాడికి గుర్రం కొనాలని తెగ ఉబలాటపడిపోతున్నారు. వాడి కోసం కాదు. తనకోసం. ఎవరూ చూడకుండా ఇంట్లో దానిమీద కూర్చుని ఊగాలని! ఇంత మనిషికి పిల్లలాడుకునే గుర్రం ఆగుతుందా! వాడు కాస్త ఎదిగేదాకా ఆగమని చెబుతున్నాను. అప్పుడు వాడే ఆయన్ని తన గుర్రాన్ని ముట్టుకోనివ్వడు” అంది సత్యవతి.

“మా ఆవిడెప్పుడూ ఇంతే! నన్ను వేసినట్లే మా బాబునీ తక్కువ అంచనా వేస్తుంది. గుర్రమేమిటి, వాణ్ణొదిలితే ఎవరెస్టు కూడా ఎక్కేస్తాడు వాడు. అది నాకు తెలుసు...” అన్నాడు రావుగారు.

“ఆఁ, లౌఫ్ గిత్తర్ పట్టుకుని నాలుగడుగులేస్తేనే పది సార్లు పడేవాడు, వాడు ఎవరెస్టు ఎక్కుతాట్ట.....” అంది సత్యవతి వెంటనే.

“లౌఫ్ గిత్తరా?” అంది శ్రీమతి అర్థంకాక.

రావుగారు నవ్వి, “అదే తోపుడు బండి. మా అవిడ ఇలాంటి వాటికి పొరపాటున కూడా తెలుగు మాట వాడదు” అన్నాడు.

“ఇక్కడున్నప్పుడు పిల్లలకి ఇక్కడి మాటలు తెలియకపోతే ఎలా? ఈయనేమో– వాడితో ఇది ఆవురోయ్, ఇది లక్కపిడతరోయ్, ఇది గొట్టాం రోయ్– అంటూ తెలుగు తప్ప మాట్లాడరు. అందుకని నేను పని కట్టుకుని జర్మన్ పదాలు వాడుతున్నాను” అంది సత్యవతి.

“నీ అలవాటు నీకు ముద్దే కావచ్చు కానీ, భోజనాల దగ్గర వంటకాల పేర్లు జర్మన్లో చెప్పకు. వచ్చినవాళ్లు జడుసుకుంటారు” అన్నాడు రావుగారు.

“ఈయనకి ఆకలేస్తున్నట్లుంది. ఇక భోజనాలకు లేద్దాం” అంటూ సత్యవతి లేచి వంటింట్లోకి వెళ్లింది. శ్రీమతి ఆమెను అనుసరించింది.

“ఈలోగా నేను డైనింగ్ టేబుల్ రెడీ చేస్తాను” అంటూ రావుగారు తనూ లేచాడు.

డైనింగ్ టేబుల్ ఎక్కడుందా అని చుట్టూ చూస్తూ నేనూ లేచి నిలబడ్డాను.

రావుగారు కొంచెం వంగి, మాముందున్న టీపాయ్‌కి నాలుగు పక్కలా కిందకు వాలి ఉన్న బల్లల్ని పైకి ఎత్తి నిలబెట్టాడు. అంతే! టీపాయ్ డైనింగ్ టేబులంత పెద్దగా మారిపోయింది.

“ఇదేదో బాగుందే. మా ఆవిడకి చూపించాలి” అన్నాను అప్రయత్నంగా.

రావుగారు ఆశ్చర్యంగా, “ఇలాంటిది మీరెప్పుడూ చూడలేదా?” అని నవ్వి, “ఏదో అడగాలని అడిగేను కానీ, ఇలాంటిది మొదటిసారి నేనూ ఇక్కడే చూశాను. యథాలాపంగా చేసినట్లు నటిస్తా కానీ, మీరు ఎక్సయిటౌతారని నాకు తెలుసు” అని నవ్వేశాడు.

నేను శ్రీమతిని పిలిచాను. ఆయన మరోసారి డైనింగ్ అరేంజ్‌మెంటు డిమాన్‌స్ట్రేట్ చేసి, “మేమిద్దరమే ఉన్నప్పుడు టీపాయ్. గెస్టులు ఇద్దరికి మించినప్పుడు డైనింగ్ టేబుల్. స్పేస్ సేవింగ్ అండ్ కన్వీనియంట్” అన్నాడు.

“ఇండియా వెళ్లగానే ఇలాంటిదొకటి ఆర్డరిచ్చి చేయించాలి” అన్నాను.

“అబ్బే, అక్కడ ఇవెందుకూ? జమీందార్ల ఇళ్లలోలాగా ఒకేసారి పాతికమంది తినేలా పొడవాటి పెద్ద టేబుల్ చేయించుకోవచ్చు. మనకక్కడ స్పేస్ ప్రోబ్లం లేదుగా” అన్నాడు రావుగారు.

“మనం జమీందార్లం కాదుగా, చిన్న టేబుల్ చాల్లెండి” అన్నాను.

రావుగారు నవ్వి, “ఆ మాటకొస్తే, ఇక్కడికొచ్చేదాకా భోజనానికి టేబులే వాడలేదు. బాసింపట్టేసుకుని కింద కూర్చుని తినడమే” అన్నాడు.

అప్పుడు స్ఫురించింది నాకు. రావుగారా మాట సరదాకి అనుండొచ్చు. కానీ నావరకూ చూస్తే, అంతవరకూ ఇండియాలో– హొటళ్లలో ఐతే ఏమో కానీ, ఇప్పటికీ భోజనానికి బాసింపట్టేసుకుని కింద కూర్చోవడమే!

ఎమ్మెస్సీ చదవడానికి వైజాగ్ వెళ్లినప్పుడు హాస్టల్లో కాకుండా వాల్తేర్ అప్‌లాండ్సులో వేరే గది తీసుకుని ఉండేవాళ్లం నేనూ, మా అన్నయ్యా! అక్కడే మొదలయింది బల్లమీద హొటలు భోజనం. ఐతే అక్కడ కూడా మేము ప్రాధాన్యమిచ్చింది– పీటల హొటలుకి. అక్కడ నేలమీద కూర్చోడానికి పీట వేసి, ముందు అరిటాకు వేసి వడ్డించేవారు. అదీ మాకు నచ్చడానికి కారణం.

అలాంటి నేనిప్పుడు డైనింగ్ టేబుల్సు గురించి చర్చిస్తున్నాను– పెద్ద అలవాటైనవాడిలా!

రావుగారి అణకువ నన్ను మళ్లీ వాస్తవానికి తీసుకొచ్చింది.

రావుగారింట మాకు అచ్చమైన తెలుగు విందు లభించింది. ముఖ్యంగా తెలుగువారికి ప్రాణప్రదమైన గోంగూర పచ్చడి.

“చాలాకాలం తర్వాత తినడంవల్ల అనుకోను. నిజంగానే ఈ పచ్చడి అద్భుతంగా ఉంది. ఈ పాళ్లు వేరనుకుంటాను” అంది శ్రీమతి.

“ఇది అమలాపురం టేస్ట్ సార్! దానికి మా అమ్మ చెయ్యి పడింది. షిప్పులో తెప్పించాం” అన్నాడు రావుగారు.

“షిప్పులోనా?” అన్నాను ఆశ్చర్యంగా.

సత్యవతి తలాడించి, "కేజీ పాకెట్టు. ఓ పెద్ద సీసాలోకి తియ్యగా, కొంచెం మిగిలితే వేరే చిన్న సీసాలోకి తీశాను. మీలాంటివాళ్లెవరైనా వస్తే రుచి చూపించడానికే కాదు, రుచికి ఇవ్వాలని కూడా అనుకున్నాను" అంది.

ఆమె ఇంకా ఏదో చెప్పబోతుండగా, రావుగారు అందుకుని, "అదో పెద్ద విషాదగాథ రావుగారూ! మీరు వినాలి. జీవితపాఠంగా పనికొస్తుంది" అన్నాడు.

పది రోజుల క్రితం ఉత్తరాది మిత్రులు వాళ్లింటికి భోజనానికొచ్చేరుట. 'చపాతీలొద్దు, మాకు అచ్చ తెలుగు భోజనం కావాలి' అన్నారుట. సత్యవతి వాళ్లకోసం కారాలు తక్కువేసి వంటలు చేసిందిట. చప్పిడి వంట గొంతు దిగకపోతే. నాలిక్కి రాసుకోవచ్చని అప్పటికి వాడుతున్న గోంగూరపచ్చడి సీసా బల్లమీద పెట్టిందిట. వచ్చినవాళ్లకి సత్యవతి వంటలు తెగ నచ్చి లొట్టలేసుకుంటూ తింటున్నారుట. ఐతే సత్యవతి, రావుగారు మాత్రం ప్రతి ఐటముకీ కొంచెం గోంగూరపచ్చడి తగిలిస్తున్నారుట.

అతిథులది గమనించి, 'అదేమిటీ, మాకు పెట్టకుండా మీరొక్కరే తింటున్నారు?' అనడిగేరుట.

'మీకోసం పదార్థాల్లో కారాలు తక్కువేశాను. తక్కువైన కారాన్ని ఇలా భర్తీ చేసుకుంటున్నాం' అందిట సత్యవతి.

'అలాగా, నేనూ ఓసారి ట్రై చేస్తాను' అంటూ అతిథి దేవి చెంచాతో పచ్చడి తీసుకుని, చెంచాని చప్పరించి, 'అద్భుతం. ఈ మాత్రం కారం మేమూ తింటాం' అంటూ ఆ చెంచాని సీసాలో పెట్టి మరికొంచెం పచ్చడి తీసుకుందిట.

ఎంగిలి చెంచా పెట్టొద్దని ఆమెని వారించడానికి కూడా అవకాశం దొరకలేదు సత్యవతికి.

"చెప్పినా ప్రయోజనం లేదు. ఉత్తరాదివాళ్లకి ఎంగిలి పట్టింపు ఉండదు" అన్నాడు రావుగారు కథ ముగిస్తూ.

"మరి ఆ పచ్చడినేం చేశారు?" అంది శ్రీమతి కాస్త అనుమానంగా.

"ఏం చేస్తాను? వాడుతున్న సీసా కదా అని పెద్దది బల్లమీద పెట్టాను. అప్పటికింకా మూడొంతుల పచ్చడి ఉంది. వాళ్లకు లేకపోవచ్చు కానీ, మనకు ఎంగిలి పట్టింపే కదా! 'మీకు అంతగా నచ్చింది కాబట్టి, మీరు తీసుకెళ్లండి' అని వాళ్లకిచ్చేశాను. ఇప్పుడు మనం వాడుతున్నది చిన్న సీసాలోది. చాలా కొంచెం ఉంది. మీకిచ్చేటంత లేదు" అని నిట్టూర్చింది సత్యవతి.

"ఉత్తరాది, దక్షిణాది అని కాకుండా– వచ్చినవారి తీరు ఎలా ఉంటుందో తెలియదు కాబట్టి– అతిథుల వద్దనకి పదార్థాలు చిన్న చిన్న గిన్నెల్లో ఉంచి పెట్టాలి. అదీ పాఠం" అన్నారు రావుగారు.

"గోంగూర పచ్చడి సంగతెలాగున్నా, ఇక్కడ కూడా మన సరుకులు బాగానే దొరుకుతున్నాయి. చింతపండుతో సహా చాలా సరుకులు మేం హాంబర్గునుంచి తెప్పించుకుంటున్నాం. అన్నీ బాగానే ఉంటున్నాయి కానీ, ఇడ్లీ రవ్వ అని ఏదో ఇస్తాడు. ఎంత ప్రయత్నించినా ఇడ్లీలు గట్టిగా రాళ్లలా వస్తుంటే, కొనడం మానేశాం. పాపం, ఈయనకి ఇడ్లీ అంటే ప్రాణం" అంది శ్రీమతి.

సత్యవతి వెంటనే, "నిజమే! ఇక్కడి నూకతో ఇడ్లీలు గట్టిగానే వస్తాయి. మేము ఇండియానుంచి షిప్పులో తెప్పిస్తాం. ఇడ్లీలు మెత్తగా దూది పింజల్లా వస్తాయి. నాలుగు రోజుల్లో షిప్‌మెంటు వస్తుంది. వీలు చూసుకుని ఓ శనివారం ఇడ్లీమీట్ పెట్టుకుందాం" అంది.

రావుగారు వెంటనే, "అసలు ఇంట్లో ఇడ్లీ నూక చాలానే ఉండేది.…." అని ఏదో అనబోతుండగా–

"ఇప్పుడా కథెందుకూ? మళ్లీ కలుసుకున్నప్పుడు చెప్పుకుందుకో కొత్త కథ ఉండాలిగా" అంది సత్యవతి.

ఆ కొత్త కథ అప్పుడు వినిపించకుండా వారించడానికి కారణం తర్వాత తెలిసింది.

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments